కథా నిలయం
శ్రీకాకుళం
J.V.R. MOORTY BOOK SHOP
NEWS & BOOK SELLERS
CHINNA B-ZAR
SRIKAKULAM-532 001

# కలగా మిగిలిన తలపు

ప్రభావతికి, ముచ్చటగా ముగ్గురు కొడుకులున్నారు. మూడో అబ్బాయి పుట్టిన మూడో యేట, ఆమె భర్త రాంబాబు, యీ లోకాన్నే విడిచిపోయాడు.

ప్రభావతినీ, పిల్లల్నే, ఆదుకునే వాళ్ళెవరూ లేకపోవడంవల్ల, పిల్లల్ని పెంచి, పెద్దచేసే బాధ్యత ప్రభావతి పైనే పడింది.

ప్రభావతి, ఆ ముగ్గురి కొడుకుల్నీ పెంచి, పెద్దవాళ్ళని చేసింది గాని, వారిలో యే ఒక్కరికీ విద్యాగంధం అబ్బింది కాదు. పోనీ, వ్యవసాయం చేసుకోవాలంటే, వాళ్ళకి సెంటు భూమికూడా లేకపోయింది.

అలాగని గోళ్ళుగిల్లుకుంటూ కూచోకుండా, పెద్దవాడు రామనాధం రూర్కెలా వెళ్ళిపోయి, యేదో చిన్న వుద్యోగం సంపాదించుకున్నాడు యెవర్నో ఆశ్రయించి. క్రమంగా యిరువురు తమ్ముళ్ళనీ, తన దగ్గరికి రప్పించుకొని, వారికీ వుద్యోగాలు వేయించాడు.

ఆ ముగ్గురి జీవితాలూ సాఫీగానే సాగిపోతున్నయ్. అయితే కన్న తల్లి తమకు దూరంగా వుందనే బాధ వార్ని అప్పుడప్పుడూ కలవర పరుస్తూం డేది. తమ దగ్గరికి వచ్చి ఉండమని, ఆమెను ఎన్నోసార్లు ప్రాధేయపడ్డారు కానీ, ప్రభావతికి మాత్రం కొడుకుల దగ్గరికి వెళ్ళేందుకు మనస్కరించలేదు. భర్త స్మృతి చిహ్నంగా మిగిలిన ఆ చిన్ని కొంప, ఆ వూరువదిలి యెక్కడికో వెళ్ళడానికి యిష్టం లేకపోయిందామెకి. ఆ వూళ్ళోనే ఆ ఇంట్లోనే తన జీవితం సాగిపోవాలని, ఆమె అభిమతం. తల్లి అభిమతాన్ని కాదనలేకపోయారు కొడుకులు. తల్లి మనసుని యే పరిస్థితిల్లోనూ నొప్పించకూడదన్నదే వారి ధ్యేయం.

* * *

రోజులు గడుస్తున్నయ్.

తల్లి ఆరోగ్యం సరిగ్గా లేదన్న వార్త ఉత్తరం ద్వారా తెలుసుకున్న ముగ్గురు కొడుకులూ, వున్నపాటున సెలవులు పెట్టుకుని, స్వస్థలం పయన మయ్యారు. అదృష్టవశాత్తూ ప్రభావతి అప్పటికే కోలుకుంది.

"ఇప్పుడు నీ ఒంట్లో యెలా వుందమ్మా?" ముగ్గురు ప్రశ్నించారు.

ప్రభావతి చిన్నగా నవ్వుకుంది.

"ఇప్పుడు బాగానే వుందర్రా. ఆ మధ్య ఓ వారం రోజులపాటు కలతగా వుంటేనూ, ఉత్తరం రాశాను ముసలితనం వచ్చేసింది కదా— మునుపటిలా ఉండమంటే యెలా? ఎప్పుడెలా వుంటుందో, చెప్పలేం కదా" అందామె మెల్లగా నవ్వుతూనే.

"నీ ఒంట్లో అస్వస్థగా వుందని తెలిశాక మేం యెంతగా ఆందోళన పడ్డామో, ఆ భగవంతుడికే తెలుసునమ్మా. ఇప్పుడు నీ ఆరోగ్యం కుదుట బడింది. అదే పదివేలు మాకు. అయినా, నువ్విలా మాకు దూరంగా వుండటం, మాకు తృప్తికరంగా లేదమ్మా! మాతోపాటే వుంటే అదో ఆనందం. అదీగాక నువ్వు స్వయంగా వండుకు తినడం, నీ కెంత శ్రమ చెప్పు? 'రామాకృష్ణ' అంటూ ఓ చోట హాయిగా కూర్చోవల్సిన నీకు, యెందుకమ్మా యింత శ్రమ?" అన్నాడు పెద్దబ్బాయి రామనాథం.

"ఔనమ్మా మేం అదే ఆలోచిస్తూ వుంటాం. నువ్వు మాతోపాటే

వుంటే మాకింకా యే చింతా ఉండదు" మిగిలిన యిరువురు వంత పాడారు.

ప్రభావతి మెల్లగా నవ్వింది.

"నే నెక్కడ వున్నా మీ దగ్గరే వున్నట్టుంటుందిరా అబ్బాయిలూ. అనుక్షణం మీరే నా కళ్ళలో మెదుల్తూ వుంటారు. నా కళ్ళకు వెలుగు మీరేరా, నా మనస్సుకి మీ జ్ఞాపకాలే వుల్లాసాన్ని కలిగిస్తూ వుంటాయి. అటువంటప్పుడు నేను యెక్కడుంటేనేం. కాకపోతే మీ నాన్నగారు కట్టించిన యీ చిన్న కొంపలోనే నా శేష జీవితాన్ని గడవడం నా అభిమతం. ఇందులోనే నాకు ఆనందం వుంది. నా గురించి మీరేం బాధపడకండి. మీరు సుఖంగా, హాయిగా, ఐక్యతగా బ్రతకడమే నేను కోరుకునేది" మమత నిండిన ఆమె హృదయంలోంచి వచ్చిన మాటలవి.

కొడుకులు మాత్రం యింకేం అనగలరు! తల్లి అభిమతానికి వ్యతిరేకంగా వాళ్లెప్పుడూ ప్రవర్తించలేదు. 'నీ యిష్టమమ్మా! నీకు యేపాటి అసౌకర్యంగా వున్నా, ఓ పోస్టుకార్డు రాసి పడేయ్. రెక్కలు కట్టుకుని వాల్తాం" అన్నాడు రామనాధం.

"అలాగే లేరా!" తృప్తిగా అంది, ప్రభావతి.

ఆమెకి బాగా తెలుసు. తన కొడుకులు తనని యెంతగా అభిమానిస్తారో, ఆరాధిస్తారో! నిజంగా తనంతటి అదృష్టవంతురాలు మరెవ్వరూ వుండరేమో ... అనుకుని, మనసులో మురిసిపోయింది.

*　　　*　　　*

ఆ రోజు సాయంత్రం, ముగ్గురన్నదమ్ములూ షికారుకి కాలవగట్టుకేసి వెళ్ళారు. మాటల సందర్భంలో రామనాధం ఒక ప్రకటన చేశాడు.

"అమ్మను రమ్మంటే, యీ వూరు, యీ కొంపా, విడిచిపెట్టి మన దగ్గరికి రానంటోంది. రమ్మని బలవంతం చేసి, ఆమె మనస్సుని నొప్పించడం వాంఛనీయం కాదు. అయితే, ఆమెకి సేవలుచేసే అదృష్టం మనకి లేకపోవడం, కేవలం మన దురదృష్టం. ఆమె ఋణాన్ని తీర్చుకోవడం యెలాగో అర్థం కావడంలేదు. ఆలోచిస్తూ వుంటే మనం చెయ్యగలిగిందొక్కటే అనిపిస్తోంది...." సాలోచనగా అంటూ, క్షణం ఆగాడు రామనాధం.

"అదేవిటో చెప్పన్నయ్యా. నువ్వేం చెప్పినా మేం కాదనం. ఇంత వరకూ మన ముగ్గురి మధ్య యే విషయంలోనూ అభిప్రాయభేదాలు రాలేదు. ఇక ముందు కూడా అటువంటివి రాకూడదు. నువ్వు యేం చెబితే దాన్ని శిరసావహిస్తాం" అన్నాడు రెండోవాడు సత్యనాథం.

"ఔనన్నయ్యా, చినన్నయ్య చెప్పింది కరక్టే. నువ్వేం చెబితే, అదే చేద్దాం" తన సమ్మతాన్ని వ్యక్తపరిచాడు మూడోవాడు అందర్లోకి చిన్నవాడైన గుర్నాథం.

రామనాథం మళ్ళీ చెప్పడానికి వుపక్రమించాడు.

"నాకు తోచిందేవిటంటే, అమ్మకి వృద్ధాప్యం వచ్చేస్తోంది. పుట్టిన ప్రతి వ్యక్తి ఎప్పుడో ఓసారి గిట్టక తప్పదు. అంచేత అమ్మకు కూడా మరణం అనివార్యం. ఆమె ఎప్పుడు చనిపోయినా, ఆమె దహనసంస్కారాదులు వైభవోపేతంగా జరిపించేసి, మన ఊళ్ళో మన క్కావల్సిన వాళ్ళకి, పేదలకు భోజనాలేర్పాటుచేసి, తద్వారా అమ్మ ఆత్మకి శాంతిని, ఓ విధమైన తృప్తినీ చేకూరిస్తే బావుంటుందేమో!"

సత్యనాథం, గుర్నాథంల మొహాలు విప్పారినయ్. రామనాథం ప్రతిపాదన వాళ్ళకి బాగా నచ్చింది.

"నీ ఆలోచన చాలా బావుందన్నయ్యా. కన్నకొడుకులుగా తల్లికి మనం నిర్వర్తించాల్సిన కర్తవ్యం యింకేముంటుంది గనుక. ఎంత డబ్బు ఖర్చయినా భరించుదాం" అంటూ సత్యనాథం తన సంసిద్ధతని వ్యక్తీకరిస్తే గుర్నాథం కూడా 'సరే' నన్నాడు.

తర్వాత యేవేవో కబుర్లు చెప్పుకుని ముగ్గురన్నదమ్ములూ యింటి ముఖం పట్టారు.

* * *

మానవుడు తలచినవన్నీ యధాతథంగా జరిగితే 'దేవుడు' 'విధి' అన్న పదాలకు అసలు అర్థమే వుండదేమో. అప్పుడు దేవుళ్ళను స్మరించే వ్యక్తులు, పూజించే భక్తులు కేవలం స్వార్థచింతతో కోరికలు కోరుతూ భజనలు చేసే నయవంచకులు, అసలు వుండనే వుండరు. అందుకనే కొన్ని సందర్భాల్లో మనిషి తలచిందొకటైతే నిజానికి జరిగేది భిన్నంగా వుంటుంది. అప్పుడే 'దేవుణ్ణి' 'విధి'ని గుర్తుకు తెచ్చుకుంటాం.

కాలచక్రం గిర్రున తిరుగుతోంది.

తల్లి క్షేమ సమాచారాలు తెలుసుకోవడంలో, రామనాథం సోదరులు అపరిమితమైన ఆసక్తి కనబరుస్తున్నారు. తాము నిర్ణయించుకున్న రీతిలో, తమ కర్తవ్యాన్ని నిర్వర్తించుకోవాలన్న ధ్యేయం వారిలో బలీయంగా వుందంటే అందులో ఆశ్చర్యం లేదు.

అయితే 'విధి' మరెలా వుంది.

ఎవరూ వూహించని విధంగా భారీ వర్షాలు కురవడం మూలాన్న ప్రభావతి నివసిస్తోన్న వూరు నానుకుని ప్రవహిస్తోన్న నది, అర్ధరాత్రివేళ భయానకంగా పొంగి ప్రవహించింది. ప్రక్కనే వున్న వూళ్ళను ముంచేసిందా వుప్పెన. సురక్షిత ప్రదేశాల కూ్కడా వెళ్ళడానికి అవకాశం, వీలులేని ఆ వూరు ప్రజల్లో చాలామంది ఆ వుప్పెన ప్రళయానికి ఆహుతి అయ్యారు. కొందరు సజీవంగా ప్రవాహంలో కొట్టుకుపోయి వారి మృతదేహాల జాడ కూడా తెలీకుండా పోయింది. అటువంటి అభాగ్యుల్లో ప్రభావతి ఒకామె కావడం ఆమె కొడుకుల దురదృష్టమే.

తమ గ్రామం జలప్రళయానికి గురయ్యిందని ఆకాశవాణి వార్తల్లో తెలుసుకున్న రామనాథం సోదరులు, కరచరణాలాడక నిశ్చేష్టులయ్యారు. తమ తల్లి యెట్లా వున్నదో, వూహించలేక, నిజం తెలుసుకోలేక, కంటతడి పెట్టుకుంటూనే వున్నపాటున స్వగ్రామానికి బైలుదేరారు ముగ్గురన్నదమ్ములూను.

అతి కష్టంమీద వాళ్ళవూరు చేరుకున్నారు ముగ్గురూనూ. అక్కడికి వెళ్ళి చూసిన దృశ్యం వారి హృదయాల్ని కలచివేసింది. తమ ఇల్లు కనిపించలేదు. తల్లీ అగుపించలేదు. ఆ కొంపతో సహా ఆమె కూడా కొట్టుకుపోయిందని తెలుసుకున్నాక, వారికి మతి పోయింది. తల్లి శవమే కాదు కనీసం ఆమె ఫోటో కూడా లభించలేదు. భోరున ఏడ్చేశారు ముగ్గురూను. తాము తలచిందేవిటి? నిర్ణయించుకున్నదేవిటి? చివరికి జరిగిందేవిటి? ఇటువంటి విపత్తు సంభవిస్తుందని కలలో కూడా వూహించలేదే "భగవాన్! ఏవిటి నీ లీలలు? మేం యేం పాపం చేశామని మాకు ఈ శిక్ష విధించావు? తల్లి ఋణం ఏ మాత్రమూ తీర్చుకోకుండా మా తలపుల్ని

ఓ కలగానే మిగిల్చి మమ్మల్ని జీవచ్ఛవాలుగా బ్రతకమన్నావా? ఎంత నిర్భయుడివి నువ్వు....?" అంటూ విలపించారు.

ఆ ముగ్గురన్నదమ్ముల ఆవేదన చూసి, చావగా మిగిలిన గ్రామ ప్రజలు, సానుభూతితో కంట తడి పెట్టుకోవడం మినహా మరేమీ చెయ్య లేకపోయారు. ఆ తరుణంలో ఎవరి ఆవేదన వారిది.

ఎంత విలపించినా, ఎంత గుండెలు బాదుకున్నా, మరణించినవాళ్లు తిరిగి రారు కదా? ఆ భావనతోనే ఆ ముగ్గురన్నదమ్ములూ, గుండెల్ని బండలుగా చేసుకొని, తల్లి ఆత్మశాంతికై ఏదో ఒక సత్కార్యం చెయ్యాలన్న నిర్ణయానికొచ్చారు.

తల్లి స్మృతి చిహ్నంగా ఆమె ఆత్మ శాంతికై ఆ వూళ్లోని వరద బాధితులకు బట్టలు, తిండి యేర్పాటు చేశారు. చావగా మిగిలిన కొద్దిమందీ ఆ అన్నదమ్ముల దాతృత్వాన్ని, తల్లిపట్ల వారికి గల భక్తి భావాన్ని మనసారా హర్షించారు. ఆ అన్నదమ్ములకు మిగిలిన తృప్తి అదొక్కటే.

* ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 2-6-1983 *